సాక్షి
కర్నూలు
శుక్రవారం । 19 । జూలై । 2024



జిల్లా జైలు తనిఖీ

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి జిల్లా జైలును తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి, ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు.



వ్యాధులొస్తాయ్ జాగ్రత్త!

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు సోకకుండా బయటపడవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. 8లో▸



నీటి వనరులపై అధ్యయనం

నీటి వనరుల లభ్యత, వినియోగంపై జల్‌శక్తి అభియాన్ బృందం ప్రతినిధులు అధ్యయనం చేస్తున్నారు. గురువారం వీరు కర్నూలు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 8లో▸

పాలన.. తీరని వేదన

- 10 వేల మంది రైతులకు అందని విద్యుత్ కనెక్షన్లు
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం 90 వేల మంది ఎదురు చూపులు
- పంట రుణాల పంపిణీపై కొరవడిన స్పష్టత
- గ్రామాల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం.. ప్రబలుతున్న డయేరియా!
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజలు ఎన్నో ఆశలతో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. వారి ఆశలపై నీళ్లు చల్లుతూ కనీస సమస్యలను సైతం రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేని దుస్థితిలో ఉంది. డయేరియా విజృంభించి ప్రాణాలు తీస్తున్నా చేష్టలుడిగి చూస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ అందక.. రుణాలు ఇచ్చేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. పంట కాలువలకు మరమ్మతులు చేయించలేని దౌర్భాగ్య పాలన కొనసాగుతోంది.



కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నేడు (శుక్రవారం) జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అనేక సమస్యలను ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అజెండాలో ప్రధానంగా వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా - పారిశుద్ధ్యం, నీటి పారుదల, విద్యుత్ శాఖలపై సమీక్షించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించే అవకాశం ఉంది. అలాగే గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం .. ప్రబలుతున్న డయేరియా.. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై సభ్యులు ప్రశ్నించే అవకాశం ఉంది.

విద్యుత్ కనెక్షన్లు ఎప్పుడిస్తారు?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 వేల మందికి పైగా రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ శాఖకు చెందిన ఇంజినీర్లు వేసిన అంచనా మేరకు ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేశారు. అయితే నేటికీ వారికి కనెక్షన్లు ఇవ్వని పరిస్థితి నెలకొనింది. అలాగే విద్యుత్ మెటీరియల్ (ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్, కండక్టర్‌తో పాటు వీటికి అనుబంధంగా అవసరమైన మెటీరియల్ కూడా స్టోర్‌లో లేనట్లు తెలుస్తోంది.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ ఏదీ ?

జిల్లాలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం లోపించింది. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. ఇటీవలే మంత్రాలయం మండలం సుంకేశ్వరీ గ్రామంలో పారిశుద్ధ్య లోపం వల్ల డయేరియా ప్రబలడంతో దాదాపు 30 మంది వరకు ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి జ్యోతి మృత్యువాత పడింది. ఈ సంఘటనకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య గ్రామాన్ని సందర్శించి డయేరియా వ్యాప్తి చెందేందుకు గల కారణాలపై ఆరా తీసి, గ్రామాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం నుంచి ఎప్పటికప్పుడు స్పష్టమైన ఆదేశాలు జారీ అవుతున్నా, క్షేత్ర స్థాయిలోని సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య సమస్య పల్లెలను వీడడం లేదు. అలాగే ... వర్షాలు అంతంత మాత్రంగా కురుస్తుండడంతో తాగునీటి సమస్యల పల్లె ప్రజలను వేధిస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులోనే తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అందని ఇన్‌పుట్ సబ్సిడీ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 90 వేల మంది రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారు. రబీలో వేసిన శనగ, జొన్న, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా నష్టపోయిన నేపథ్యంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కావాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 54,382 మంది రైతులకు రూ.58.28 కోట్లు, నంద్యాల జిల్లాలో 37,208 మంది రైతులకు రూ.37.76 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో అందాల్సి ఉంది. అలాగే ఈ సీజన్‌కు సంబంధించి వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు అందించిన పంట రుణాలపై నేటికి స్పష్టత లేదు. ఖరీఫ్ ప్రారంభంలో కొద్దిపాటి వర్షాలు కురిసినా, వ్యవసాయానికి అనువైన వర్షాలు నేటికీ కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత రైతులు ప్రధానంగా సాగు చేసే వేరుశనగ విత్తనం కూడా కొరత కూడా ఉంది. ఉమ్మడి జిల్లాకు 20 వేల క్వింటాళ్లు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కోరగా, ఇప్పటి వరకు 13,929 క్వింటాళ్లు మాత్రమే సరఫరా అయ్యింది. దీంతో వేరుశనగ విత్తనం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

జెడ్పీ చైర్మన్‌కు భద్రత తొలగింపు

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ప్రస్తుతం ఉన్న ఇద్దరు గన్‌మెన్ల భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనికి సంబంధించి గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి గన్‌మెన్లకు ఆదేశాలు అందాయి. రాత్రి 8 గంటల్లోపు ఇద్దరు గన్‌మెన్లు ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో జెడ్పీ చైర్మన్‌కు కూడా పోలీస్ అధికారులు ఫోన్ చేసి గన్‌మెన్లను పంపాలని కోరారు. ఇందుకు ఆయన సమ్మతించి ఇద్దరు గన్‌మెన్లను పంపేందుకు నిర్ణయం తీసుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల మధ్య లోపించిన సమన్వయం కారణంగా ఆలూరులో తాగునీటి సమస్య ఉత్పన్నమైందనే విమర్శలు ఉన్నాయి.

పంట కాలువలకు మరమ్మతుల్లేవు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేయనున్న కేసీ కెనాల్, ఎల్ఎల్‌సీ, ఎస్‌ఆర్‌బీసీ, తెలుగు గంగ తదితర పంట కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్ సాగుకు ముందే ఓఅండ్‌ఎం నిధులు మంజూరు చేసి పంట కాలువలకు నీరు వచ్చేందుకు ముందుగానే పనులు పూర్తి చేసే వారు. గత ఐదేళ్లలో దాదాపు రూ.232 కోట్లు కాలువల మరమ్మతులకు ఖర్చు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం ఈ పనులు చేసేందుకు రూ.70.37 కోట్లకు మొదటగా ప్రతిపాదనలు చేయగా, నిధులు లేవని రూ.19.28 కోట్ల ప్రతిపాదనలు తీసుకున్నారు. నెల రోజులైనా ప్రతిపాదనలకు అతిగతీ లేదు.

హాజరుకానున్న మంత్రులు

జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలసిన ఎస్పీ



జిల్లా జడ్జికి మొక్క ఇస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావును జిల్లా కోర్టులో నూతన ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయ శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో పనిచేయడంపై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరఫున కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

కర్నూలు(అర్బన్): ఈ నెల 23 నుంచి 27వ తేది వరకు ఐదు రోజుల పాటు ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులు చేస్తారన్నారు. ముఖ్యంగా కొత్తగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ డాక్యుమెంటేషన్ అప్‌డేట్, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవచ్చన్నారు. ఈ నిర్వహణ సమయంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–6/ డబ్ల్యూఈడీపీఎస్‌ల స్థానంలో ఇతర సచివాలయ సిబ్బందిని ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారన్నారు. శిబిరం నిర్వహించే సచివాలయ పరిధిలో ఇద్దరు సచివాలయ సిబ్బంది డాక్యుమెంటేషన్ పరిశీలనకు సహకారం అందిస్తారని పేర్కొన్నారు.

ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఎన్‌టీకే నాయక్

- ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా షేక్షావలి ఖాన్



ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌ఛాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ 122 విడుదల చేసింది. వర్సిటీలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న ఎన్‌టీకే నాయక్ ప్రస్తుతం వర్సిటీ రెక్టార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఇన్‌చార్జి వీసీ ఆయన బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సీడీసీ డీన్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య ఎన్.నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పి.వి.సుందరానంద్ తదితరులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌ఛాన్స్‌లర్‌గా యోగి వేమన యూనివర్సిటీ బాటనీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పటాన్ షేక్షావలి ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

రూ.68 లక్షలకు ఐపీ

డోన్ టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఒక వ్యాపారస్తుడు రూ.68 లక్షలకు ఐపీ పెట్టడంతో ఆయనకు అప్పు ఇచ్చిన వారికి గురువారం లాయర్ ద్వారా నోటీసులు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఐపీ దాఖలు చేసిన సదరు వ్యాపారస్తుడు గత కొద్ది సంవత్సరాలుగా ఇటుకలు, కంకర ఫ్యాక్టరీలు నడుపుతూ వ్యాపార నిమిత్తం 12 మంది నుంచి రూ.68 లక్షలు అప్పు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం రుణదాతలకు నోటీసులు రావడంతో లబోదిబోమంటున్నారు.

జూరాల నుంచి శ్రీశైలానికి వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి గురువారం తెల్లవారుజాము నుంచి వరదప్రవాహం మొదలైంది. ఇందిరాప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పాదనను ప్రారంభించి శ్రీశైలానికి వరద నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం నుంచి గురువారం వరకు కుడిగట్టు కేంద్రంలో 5.761, ఎడమగట్టు కేంద్రంలో 3.515 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 20,506 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం సాయంత్రం నాటికి జూరాల నుంచి 25,174 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. జలాశయంలో 32.3781 టీఎంసీలనీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 806.60 అడుగులకు చేరుకుంది.

కర్నూలుకు చేరుకున్న కొత్త డీఐజీ



డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు: కర్నూలు రేంజ్ డీఐజీగా నియమితులైన డాక్టర్ కోయ ప్రవీణ్ కర్నూలుకు చేరుకున్నారు. గ్రేహౌండ్స్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న ఈయనను కర్నూలుకు నియమించి ఇక్కడున్న విజయరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఈనెల 11న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం ఆయన కర్నూలులోని బి.క్యాంప్ పోలీస్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ప్రస్తుత డీఐజీ విజయరావు, ఎస్పీ బిందు మాధవ్ తదితరులు నూతన డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. బదిలీపై వెళ్తున్న డీఐజీ విజయరావుకు రాత్రి స్థానిక కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

కర్నూలు సిటీ: తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఉల్చాల గ్రామ సచివాలయం వద్ద గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహానుభావులారా.. మన్నించండి!



దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహాత్ముడు ఒకరు, రాజ్యాంగ నిర్మాత మరొకరు. వారి స్థానం చరిత్రలో ఎప్పుడూ అజరామరమే. ఇలాంటి మహానుభావులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు. కానీ తిమ్మాపురం ఎంపీడీవో కార్యాలయంలో మాత్రం వీరి చిత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల ఫొటోల కింద ఉంచారు. ఇది పలు విమర్శలకు తావిస్తోంది.

- మహానంది

ఆశలన్నీ తుంగభద్రపైనే!



వరద నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

నేడు సాగునీటి సలహామండలి సమావేశం • హాజరుకానున్న మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

కర్నూలు సిటీ: వరుణుడు కరుణించడం లేదు. జిల్లాలో వర్షాలు ఆశించిన మేర కురవడం లేదు. రైతులు తమ ఆశలన్నీ తుంగభద్ర నది జలాలపైనే పెట్టుకున్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం వస్తోంది. రిజర్వాయర్ సామర్థ్యం 40 టీఎంసీలకు చేరితే కాల్వలకు నీటిని విడుదల చేయాలనే నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు నీటి విడుదలపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

చర్చించే అంశాలు ఇవే..

- తుంగభద్ర నది ప్రవాహ నీటిపైనే గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు, నది తీరంలోని ఏపీ ఆయకట్టు అభివృద్ధి సంస్థ ఎత్తిపోతల పథకాలు, పులికనుమ రిజార్వయర్లు ఆధారపడి ఉన్నాయి. టీబీ డ్యాంకు ఈ ఏడాది 171 టీఎంసీల నీటి లభ్యత ఉండే అవకాశం ఉందని ఇంజినీర్లు అంచనా వేశారు. ఈ అంచనా మేరకు ఎల్ఎల్‌సీ, ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు సుమారు 21 టీఎంసీలను కేటాయించారు. జల చౌర్యం లేకుండా నీటి వాటాను రాబట్టాల్సి ఉంది.
- జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, నదితీరంలోని ఎత్తిపోతల పథకాలు, పులికనుమ, హంద్రీ–నీవా సుజల స్రవంతి, ఆలూరు బ్రాంచ్ కెనాల్, కేసీ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టుల కింద 3.27 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్‌లో 1.94 లక్షల ఎకరాల ఆయకట్టుకు సంపూర్ణంగా నీరు అందించాల్సి ఉంది.
- గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కు హంద్రీ–నీవా కాల్వ 110.04 కి.మీ దగ్గర అదనపు స్లూయిజ్ ఏర్పాటు చేసి ఏటా మూడు టీఎంసీల నీటిని మళ్లించేందుకు రూ.5.90 కోట్లతో పనులు పూర్తి చేశారు. గత మూడున్నరేళ్లుగా జీడీపీలో నీటి మట్టం తగ్గకుండా హంద్రీ–నీవా నుంచి నీటిని మళ్లించారు. హంద్రీ–నీవా కాలువకు నీరు వచ్చిన వెంటనే మళ్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఐఏబీలో తీర్మానం చేయాలని కోరుతున్నారు.

నేడు సాగుకు నీరు విడుదల

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి గంటకు 1,21,160 క్యూసెక్కుల చొప్పున నీటి ప్రవాహం వస్తోంది. గురువారం రాత్రికి ఇన్‌ఫ్లో మరింత పెరిగి లక్షన్నర క్యూసెక్కులకు పైగా నమోదయ్యే సూచనలు కనబడుతున్నాయి. తాగునీటి అవసరాల కోసం టీబీ బోర్డు అధికారులు బుధవారం 300 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు వదిలిన సంగతి తెలిసిందే. జలాశయానికి పెద్ద ఎత్తున వరద రావడంతో శుక్రవారం నుంచి ఎల్లెల్సీకి కర్ణాటక కోటా సాగు నీరు విడుదల చేయనున్నారు. అలాగే హెచ్చెల్సీకి 22 నుంచి నీటిని వదిలేందుకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా ఇరిగేషన్ అధికారులు ఇండెంట్ ఇస్తే వెంటనే నీరు వదిలే అవకాశాలున్నాయి. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 60 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు ఐఏబీ సమావేశం

కర్నూలు(సెంట్రల్): ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు(ఐఏబీ) సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 19న శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు చెప్పారు. కాగా సమావేశానికి సంబంధించి జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డిశేఖరరెడ్డి ప్రత్యేక నివేదికలను సిద్ధం చేశారు. జిల్లా పరిధిలోని తాగునీటి ప్రాజెక్టులు, ఎల్ఎల్‌సీ ఆయయట్టుకు నీటి విడుదల, తుంగభద్ర డ్యామ్‌లో నీటి వాటాపై చర్చించే అవకాశం ఉంది.

గస్తీకి... సుస్తీ!

నిఘా లేని పోలీసింగ్

- రాత్రి తనిఖీలు తూతూమంత్రం
- అటకెక్కిన ‘సేఫ్ సిటీ’ కార్యక్రమం
- పర్యవేక్షణ లేక పెరుగుతున్న నేరాలు



విజిబుల్ పోలీసింగ్ కోసం గతంలో ప్రారంభించిన బ్లూ కోల్ట్స్ (ఫైల్)

కర్నూలు: జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ హయాంలో నేరాల అదుపునకు, రాత్రి గస్తీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లారే వరకు రోడ్ల మీదే ఉండి గస్తీ విధులు నిర్వహించేలా సిబ్బందిని సమకూర్చారు. శివారు కాలనీల్లోనూ గస్తీని కొనసాగించారు. కర్నూలు సేఫ్ సిటీ పేరుతో ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమానికి మంచి ఫలితాలు వచ్చాయి. కొంత మేర రాత్రి నేరాలు కూడా అదుపులోకి వచ్చాయి. ఇదంతా మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆయన బదిలీపై వెళ్లగానే ఆ కార్యక్రమం అటకెక్కింది. ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే రాత్రే కాదు.. పగలు కూడా విజిబుల్ పోలీసింగ్‌కు దిక్కు లేకుండాపోయింది.

ముందస్తు నేరాలు అదుపు చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన విజిబుల్ పోలీసింగ్ జిల్లాలో పక్కాగా అమలు కావడం లేదు. రోడ్డెక్కి ఫొటో తీసుకున్నామా.. ఉన్నతాధికారుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశామా అన్నట్లు ఉంది గస్తీ పోలీసుల ప్రవర్తన. దీన్ని ఆసరాగా చేసుకున్న నేరగాళ్లు, దొంగలు, అసాంఘిక శక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. స్టేషన్ అధికారి నుంచి హోంగార్డు వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో విజిబుల్ పోలీసింగ్ చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నప్పటికీ నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలనీల్లో గస్తీ తిరిగినట్లు ఆధారాలు చూపి వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులైతే కేవలం జరిమానాల విధింపుపైనే దృష్టి సారిస్తున్నారు. పగలు, రాత్రి రోడ్లపైన, వీధుల్లో పోలీసులు తిరుగుతారనే భయం నేరగాళ్లలో లేకుండా పోయింది. కర్నూలు శివారు కాలనీలు, వీధుల్లో పోలీసుల తాకిడి కొంతకాలంగా కానపడని పరిస్థితి. పాత నేరస్తుల గుర్తింపునకు అనుమానితులపై నిఘా కొరవడింది. రైల్వేస్టేషన్, బస్టాండ్, దేవాలయాలు, యాత్రికుల సముదాయాల వద్ద పోలీసుల తాకిడి అసలు కనిపించడం లేదు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందినవారు నగరాల్లోని కాలనీలు, గ్రామాల్లో తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను గమనించి రాత్రి వేళ చోరీలకు పాల్పడుతుంటే ఎవరు నువ్వు.. ఇంత రాత్రిలో తిరుగుతున్నావు? అని అడిగే వారు కరువయ్యారు. కాలనీల్లో ఘర్షణకు పాల్పడి ఒకరినొకరు కొట్టుకుని ఫిర్యాదు చేసుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తేనే విషయం బయటకు వస్తోంది. ఇలా నేరాలు జరిగాక పోలీసుల ప్రమేయం కనపడుతోంది.

నిరంతర గస్తీ కోసం...

విజిబుల్ పోలీసింగ్ కోసం నగర పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్లలో క్యూఆర్‌టీ వాహనాలు ఉన్నాయి. వాటికి తోడు బ్లూ కోల్ట్స్ ద్విచక్ర వాహనాలు సైతం అందించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా పెట్టడం, అనుమానితులపై దృష్టి పెట్టడం, గొడవలు జరగకుండా చూడటంతో పాటు ముమ్మరంగా గస్తీ తిరగాలి. చాలా ప్రాంతాల్లో పోలీసులు గస్తీ తిరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. పూర్తిస్థాయిలో గస్తీ కాయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు భయపడతారు. కాలనీల్లో దొంగతనాలు ఉండవు. పాత రౌడీలు నేరాలు చేసేందుకు వెనుకడుగు వేస్తారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కొత్త పోలీస్ బాస్ కూడా నగరాల్లో బీట్ల సంఖ్యను పెంచి నేరాలు జరగకుండా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టత ఇచ్చారు. విజిబుల్ పోలీసింగ్ పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టడం ద్వారా భద్రత కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నగరానికే కాదు.. నిఘాకూ దూరమే..

కర్నూలు చుట్టుపక్క ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. కొత్తగా నివాసాలు, కాలనీలు వెలుస్తున్నాయి. అదే తీరున అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు శివారు కాలనీలపై కన్నేసి కన్నం పెడుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు కొన్ని కాలనీలు అడ్డాగా మారినప్పటికీ అక్కడ పోలీస్ నిఘా లేకపోవడంతో అక్రమార్కులకు, దొంగలకు అవకాశంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. నగరం నలువైపులా శివారు ప్రాంతాల్లో ముళ్లపొదలతో కూడిన ప్రాంతాలు ఉన్నాయి. పగలు, రాత్రి అటువైపు వెళ్లాలంటే మహిళలు వెనుకంజ వేసే పరిస్థితి. జనావాసాలకు కొన్ని కాలనీలు దూరంగా ఉండటంతో గస్తీ అంతంతే ఉంటోంది. పోలీసు నిఘా లేకపోవడంతో హంద్రీ, తుంగభద్ర నది ఒడ్డు ప్రాంతాల్లో పేకాట స్థావరాలు జోరుగా సాగుతున్నాయి.

పోలీసు నిద్ర మేల్కొంటేనే....

- రాత్రిపూట పోలీస్ గస్తీ తగ్గడంతో దొంగలు సులువుగా పని చక్కబెడుతున్నారు.
- అర్ధరాత్రి నుంచి తెల్లవారు 3 గంటల్లోపు ఎక్కువ చోరీలు జరుగుతున్నాయి.
- ఆ సమయంలో అజ్ఞాత, అనుమానిత వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, దొంగలను గస్తీలో భాగంగా గమనిస్తూ ఉండాలి.
- చెడు వ్యసనాలకు బానిసలై డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్న వారిపై కన్నేసి ఉంచాలి.
- రాత్రిపూట అనుమానంగా సంచరించేవారి నేరచరిత్ర, వివరాలు తనిఖీ చేయాలి.
- నేరస్తులు ఉండే ప్రాంతాల్లో నాకాబందీ, తనిఖీలు ముమ్మరం చేయాలి.
- సీసీ కెమెరాలతో నిఘా పర్యవేక్షించి అనుమానితులను విచారించాలి.

క్లుప్తంగా

వన్యప్రాణి వేటగాళ్ల అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న అటవీ సిబ్బంది

ఆళ్లగడ్డ: అహోబిలం అటవీ ప్రాంతంలోని పావన నరసింహస్వామి క్షేత్రం సమీపంలో ఇద్దరు వన్యప్రాణుల వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు అటవీ అధికారులు ముర్తుజావళి, నాగేంద్రనాయక్ తెలిపారు. పావన నరసింహస్వామి క్షేత్రం సమీపంలో ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకీతో అనుమానాస్పదంగా తిరుగుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అక్కడ ఉన్న సవరం పిచ్చయ్య, సవరం వీరయ్యను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి నాటు తుపాకీ, తూటాలు, పేలుడు మందు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

పాముకాటుకు చిన్నారి మృతి

- కోలుకుంటున్న తండ్రి



మధుప్రీతి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో గురువారం తెల్లవారుజామున పాముకాటుకు గురై మధుప్రీతి (3) అనే చిన్నారి మృతి చెందింది. వివరాలు.. మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామానికి చెందిన వీరేష్, భార్య భార్గవి, ఇద్దరు కుమార్తెలతో కలసి కడివెళ్ల గ్రామంలో మొహర్రం వేడుకలకు బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే గుడిసెలో నిద్రించగా అర్ధరాత్రి వీరేష్, చిన్న కుమార్తె మధుప్రీతికి పాము కాటు వేసింది. చిన్నారి గట్టిగా ఏడవడంతో నిద్రలేచి చూడగా పాము కరిచినట్లు గుర్తించారు. నాటు వైద్యం కోసం కల్లుదేవకుంటకు వెళ్లి తర్వాత ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఈలోపే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వీరేష్ ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. చిన్నారి మృతితో కుటుంబలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

కర్నూలు (అర్బన్): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సూచించారు. ఆయన గురువారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి తాగునీరు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామల్లోని ప్రజలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎప్పటిప్పుడు శానిటేషన్, ఫాగింగ్ పనులు చేయించాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలతో పాటు ప్లేట్‌లెట్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ, విషజ్వరాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులొస్తాయ్ జాగ్రత్త!

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- దోమలతో మలేరియా, డెంగీ జ్వరాలు
- నీరు, ఆహార కలుపితంతో డయేరియా
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకం



డెంగీ వ్యాధి లార్వాను అరికట్టేందుకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పారిశుద్ధ్యం లోపం, నీటి నిల్వలతో రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. వర్షాకాలం దోమలు వృద్ధి చెంది దోమకాటు వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. వీటితోపాటు వైరల్ జ్వరాలు పొంచి ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు విజృంచే ఆస్కారం ఉంది. వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల వ్యాధులు సోకకుండా బయటపడవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. 2023 జనవరి నుంచి డిసెంబర్ నెల వరకు నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 251 డెంగీ కేసులు, 28 మలేరియా కేసులు నమోదయ్యాయి. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 113 డెంగీ, 3 మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాలలో జిల్లా స్థాయి ఆసుపత్రితో పాటు జిల్లాలో 11 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 53 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికే జ్వర పీడితులు ఆసుపత్రులకు వెళ్లి మందులు పొందుతున్నారు. డెంగీ, మలేరియా లక్షణాలు ఉన్నవారికి అనుమానంతో రక్త పరీక్షలు సైతం చేస్తున్నారు.

డెంగీ ప్రమాదకరం

ఎడిస్ ఈజిప్ట్ అనే ఆడ దోమ ద్వారా డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు పగటి పూట ఎక్కువగా కుడతాయి. డెంగీ వైరస్‌లో ఇన్ఫెక్ట్ అయిన దోమలోనే కాకుండా గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. కాబట్టి త్వరగా ఎక్కువ మందికి వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ దోమ మంచినీటిలోనే గుడ్లు పెడుతుంది. ఎడిస్ దోమకాటు తర్వాత 3 నుంచి 14 రోజుల్లో డెంగీ వచ్చే అవకాశం ఉంది. అకస్మికంగా జ్వరం, విపరీతమైన కండరాలు, కీళ్లు, కళ్ల నొప్పులు, వాంతులతో డెంగీ మొదలవుతుంది. కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది. దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తంప్లేట్‌లెట్స్ తగ్గినా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. హెమరైజ్డ్, షాక్ సిండ్రోమ్ సోకిన వారిని ఆసుపత్రిలో చేర్పించాల్సి ఉంటుంది. డెంగీ నిర్ధారణకు మొదటి వారంలో ర్యాపిడ్‌కిట్‌తో పరీక్ష చేస్తారు. రెండోవారంలో తీవ్రతను బట్టి ఎలీసా పరీక్ష నిర్వహిస్తారు. డెంగీపట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.

మలేరియా.. అప్రమత్తం

అనాఫిలస్ అనే దోమకాటు ద్వారా మలేరియా జ్వరం వస్తుంది. ఈ జ్వరం సోకిన వారికి చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం సోకుతుంది. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు రకాల క్రిముల వల్ల మన ప్రాంతంలో మలేరియా వస్తుంది. వైవాక్స్ మలేరియా అంత తీవ్రం కాకపోయినప్పటికీ ఎక్కువ కాలం బాధిస్తుంది. ఫాల్సీఫారం ప్రాణాంతకం కావచ్చు. చికిత్సతోపాటు నివారణ చర్యలు కూడా మంచి ఫలితాలను ఇస్తాయి. గర్భిణులు, చిన్నపిల్లలు ఈ వ్యాధి తీవ్రతకు ఎక్కువగా గురవుతారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకుని నిర్ధారించుకోవాలి. మలేరియా రకాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు పూర్తి మోతాదులో చికిత్స పొందాలి. నీటి నిల్వలో పెరిగే అనాఫిలస్ దోమ కాటు నుంచి రక్షణ పొందటం ఉత్తమం.

టైఫాయిడ్..

కలుషిత ఆహారం, కలుషిత నీరు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ వ్యాధి సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తీవ్రమైన జర్వం, కొద్దిగా దద్దుర్లు, చిన్న పిల్లల్లో విరేచనాలు, పెద్దవారిలో మలబద్ధకం, కడుపులో నొప్పి, తలనొప్పి, ఆకలి లేకుండా ఉండటం జరుగుతుంది. ఈ వ్యాధి సోకిన వారిలో 10 శాతం మంది తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వారిలో పేగుల్లో పుండ్లు పడి రక్తం స్రవించడం ద్వారా తీవ్ర అస్వస్థతకు గురవుతారు. మెదడు, గుండెకు సంబంధిత వ్యాధులు కూడా రావచ్చు. బాధితులు సకాలంలో వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాలి.

మెదడువాపుతో జాగ్రత్త

మురుగునీటిలో పెరిగే క్యూలెక్స్‌అనే దోమ కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. రెండు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువ. ఆకస్మికంగా జర్వం వచ్చి జ్వర తీవ్రత ఎక్కువ కావడం, కళ్లు అసాధారణంగా తిరగడం, అపస్మారక స్థితి సంభవించుట, శరీరంలో ఏదో పక్క పక్షవాతానికి గురికావడం, వాంతులు, విరేచనాలు, శరీరం మెలికలు తిరిగి కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారిలో ఒక శాతం మందికి ప్రాణాంతకం కావచ్చు. చిన్నపిల్లలకు అందించే వ్యాధి నిరోధక టీకాల్లో ఈ వ్యాధిని చేర్చడం జరిగింది.

డెంగీకి సకాలంలో చికిత్స అవసరం



జ్వరం సోకినప్పుడు అశ్రద్ధ చేయకుండా నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. డెంగీ పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవిస్తుంది. డెంగీ సోకిన వారిలో 20 నుంచి 30 మందిలో ప్లేట్‌లెట్స్ తగ్గి సీరియస్ అయ్యే అవకాశం ఉంది. అధిక జ్వరం, ఒళ్లునొప్పులు ఎక్కువగా ఉంటాయి. జ్వరం వచ్చినప్పుడు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కోవెలకుంట్ల

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం అన్ని విధాలా మంచిది. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతోపాటు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్నాం. వ్యాధి సోకిన తర్వాత చికిత్స పొందటం కంటే రాకుండా చూడటం మేలు. బయటి ఆహార పదార్థాలు తినకుండా ఇంట్లో తయారు చేసిన వేడి వేడి ఆహారం తీసుకోవడం అన్ని విధాలా మంచిది.

– డాక్టర్ విద్యాసాగర్, రేవనూరు పీహెచ్‌సీ, కోవెలకుంట్ల మండలం

కొండెక్కిన కోడిగుడ్ల ధరలు

- వంద కోడిగుడ్ల ధర హోల్‌సేల్‌లో రూ.600 పైమాటే
- రిటైల్‌గా ఒక్కో గుడ్డు రూ.7 నుంచి రూ.8కి విక్రయం



విక్రయానికి ఉంచిన కోడిగుడ్లు

గోస్పాడు: అన్ని వయస్సుల వారికి మంచి పౌష్టికాహారంగా పేరొందిన కోడి గుడ్డు ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఒకవైపు కూరగాయల ధరలు అగ్గి పుట్టిస్తుండడంతో ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటివరకు పప్పు కంటే చికెన్ బెస్ట్ అన్న వారందరూ ఇప్పుడు ముక్కల కంటే మొక్కలే మేలనుకుంటున్నారు. కోడిగుడ్డు, చికెన్ ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. రెండు నెలల క్రితం నుంచి రోజురోజుకు ధరలు కొండెక్కుతున్నాయి. పెరుగుతున్న ధరలతో సామాన్యులు అవాక్కవుతున్నారు. ధరలను చూసి జేబులు తడుముకోవాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు ఒకలాఉంటే మారుమూల గ్రామాల్లో కోడి గుడ్ల ధరలు మరింత అధికంగా ఉంటున్నాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచి కోడిగుడ్ల ధరలు పెరుగుతున్నాయి. జనవరి దాటాక నెలరోజుల పాటు 30 గుడ్ల ధరలు రూ.120 నుంచి రూ.130 వరకు పలికింది. తర్వాత నిలకడ లేకుండా ప్రతిరోజు 5 పైసల నుంచి 15 పైసల వరకు పెరుగుతూ ప్రస్తుతం వంద గుడ్ల ధర రూ.600 నుంచి రూ.625 వరకు పలుకుతోంది. ఈ ప్రాంతానికి హైదరాబాద్, మహబూబ్‌నగర్ నుంచి కోళ్లను, గుడ్లను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ధరలు మరింత పెరుగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కోసారి ధర అధికంగా ఉన్నా నష్టాలను భరిస్తూనే వ్యాపారాలు సాగించాల్సి వస్తుందని విక్రయదారులు ఆవేదన చెందుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో నూడిల్స్, ఆమ్లెట్ల బండ్లు పెరగడంతో వీటి వాడకం సైతం విపరీతంగా పెరిగింది. దీంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి పెరగకపోవడంతో ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. పట్టణాల్లో రిటైల్‌గా ఒక గుడ్డును రూ.7కు విక్రయిస్తుండగా, గ్రామాల్లో రూ.8కి విక్రయిస్తున్నారు. పౌష్టికాహారంలో భాగంగా నిత్యం కోడిగుడ్లను తీసుకునేవారు ధర పెంపుతో ఒకింత ఇబ్బందులు పడుతున్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ గడువు పొడిగింపు

నంద్యాల: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12న జీఓ ఎంఎస్ నంబర్ 82ను జారీ చేసినట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారని జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు విలువైన వైద్యసేవలను ఎన్నిసార్లయినా పొందవచ్చని వివరించారు. వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, నిర్దేశిత చికిత్సలకు ఓపీ సేవలు కూడా పొందవచ్చని తెలిపారు. www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.1250 చెల్లించి వచ్చే మార్చి 31 వరకు లబ్ధి పొందవచ్చని వివరించారు. ప్రీమియం చెల్లించిన వారు చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటి వనరులపై కేంద్ర బృందం అధ్యయనం

- జిల్లాలో నీటి లభ్యత, సాగు, తాగునీటి వినియోగంపై ఆరా
- జలశక్తి పనులపై ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన



సుంకేసుల డ్యాంను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): భూగర్భ జలాల అభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏ విధంగా ఉపయోగపడుతోంది. నీటి వనరుల లభ్యత, వినియోగం, సాగు, తాగు నీటి అవసరాలకు ఎంతమేర వినియోగిస్తున్నారు. భూగర్భ జలాల పరిస్థితి ఏ విధంగా ఉందనే అంశాలపై జిల్లాకు వచ్చిన జల్‌శక్తి అభియాన్ బృందం ప్రతినిధులు నిశితంగా పరిశీలన జరిపారు. సెంట్రల్ టీమ్ నోడల్ అధికారి, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్స్‌పల్ కమిషనర్ చిత్తరంజన్‌దాస్, టెక్నికల్ ఆఫీసర్, సీటెక్ సైంటిస్ట్ బిజయ్‌కేతన్ మోహితా బృందం గురువారం కర్నూలు పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. ఈ బృందం 20వ తేదీ వరకు జిల్లాలో నీటి వనరులను పరిశీలిస్తుంది. మొదటిరోజు కర్నూలు నగర తాగునీటికి ఉద్దేశించిన సుంకేసుల బ్యారేజీని సందర్శించింది. డ్యాం నుంచి తాగు, సాగునీటికి ఎంతమేర వినియోగిస్తున్నారనే వివరాలపై సభ్యులు ఆరా తీశారు. డ్యాం ప్రాధాన్యతను నీటిపారుదల శాఖ అధికారులు వారికి వివరించారు. అనంతరం మునగాలపాడులోని ఎస్ఎస్ ట్యాంకును, గార్గేయపురం ఎంఐ ట్యాంకు, నగర వనాన్ని పరిశీలించారు. కర్నూలు నగరం దేవనగర్‌లో అమృత్ స్కీమ్ కింద 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును కూడా సందర్శించారు. శుద్ధి చేసిన నీటిని ఏ అవసరాలకు వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జల్‌శక్తి ఫొటో ప్రదర్శనను తిలకించారు. భూగర్భ జలాలను పెంచేందుకు అమృత్ సరోవర్‌లు, ఫాంపాండ్స్, వాటర్ రీచార్జ్ స్ట్రక్చర్లు పెద్దఎత్తున నిర్మిస్తున్నట్లు డ్వామా పీడీ అమరనాథరెడ్డి వివరించారు. అనంతరం జలశక్తి అభియాన్‌కు సంబంధించి నిర్వహించిన లైన్ డిపార్టుమెంట్ అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో జరుగుతున్న జలసంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులను కలెక్టర్ రంజిత్‌బాషా వివరించారు.

నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

- 3500 బెల్లం ఊట ధ్వంసం
- 60 లీటర్ల నాటుసారా సీజ్



నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న సెబ్ సిబ్బంది

కర్నూలు: జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లాలో ఏడు సెబ్‌స్టేషన్లు ఉండగా వాటి పరిధిలోని 82 గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు. 26 గ్రామాల్లో ఎక్కువగా సారా తయారీతో పాటు విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు సెబ్ అధికారులు గుర్తించి గురువారం స్టేషన్ల వారీగా ఎక్కడికక్కడ దాడులు నిర్వహించారు. కల్లూరు మండలం ఓబులాపురం తాండ గ్రామ పరిసర ప్రాంతాల్లో కర్నూలు సెబ్ ఎస్‌ఐ రెహానా బేగం ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆదోని శివారులోని సింగరాయకొండ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఓ మహిళ నుంచి 68 పౌరుగు రాష్ట్రాల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కొండగుట్టల్లో ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 1700 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. అలాగే ఆలూరు మండలం అరికెరతాండ గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో సీఐ సోమశేఖర్, సిబ్బంది విజయుడు, చంద్రన్న, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో గురువారం 19 సంవత్సరాల్లోపు విభాగం రాష్ట్రస్థాయి ఓపెన్ బాలికల చెస్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, విద్యావేత్తలు రామకృష్ణారెడ్డి, సుధాకర్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నరసింహరాజు పాల్గొని చెస్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ పోటీ మెదడుకు పదును పెడుతుందన్నారు. బాలల్లో మానసిక వికాసం కలిగి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన చెస్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆయన వివరించారు. క్రీడాకారులకు పీజీ కళాశాలలో వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం విజేతలకు పతకాలు, ట్రోఫీలు, బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్‌డీ రాజేష్ చేతులమీదుగా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ ఉదయ్, రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, నిర్వాహకులు సుజాత, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి జి.ప్రతిభాదేవి

కర్నూలు (లీగల్): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి జి.ప్రతిభాదేవి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆమె గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో 'వన్ కే వాక్' ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బైక్ ర్యాలీని కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులతో పాటు వారితో ప్రయాణించే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. మోటార్ వాహనాల చట్టం నియమాలు, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా సెక్రటరీ శామ్యూల్‌పాల్ అధ్యక్షతన విద్యార్థులు జడ్జి జి.ప్రతిభాదేవి, ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డికి గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. జడ్జి పి.పాండురంగారెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, ఇతర న్యాయమూర్తులు, శిక్షణ న్యాయమూర్తులు, డీఆర్వో మధుసూదన్, ట్రాఫిక్ సీఐ గౌతమి, కర్నూలు టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, న్యాయవాదులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో లద్దగిరి సర్పంచ్

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం లద్దగిరి గ్రామ సర్పంచ్ పట్టి హనుమంతు బ్యాంకు అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి రూ.1.95 లక్షలను కాజేశారు. బుధవారం రాత్రి హనుమంతు ఇంట్లో ఉండగా బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష, రూ.50 వేలు, రూ.5 వేల చొప్పున 9 సార్లు మొత్తం రూ.195 లక్షలు ఇతర ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు వరుసగా మెసేజ్‌లు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన హనుమంతు వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి అకౌంట్ లావాదేవీలను నిలిపివేయడంతో పాటు, గురువారం కోడుమూరు పోలీసులతో పాటు, సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు–దూపాడు రైల్వేస్టేషన్ల మధ్య 248/10 కి.మీ వద్ద గురువారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆయన ముఖం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. ఘటనపై స్థానికులు కర్నూలు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. సూపరింటెండెంట్ రంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల చొక్కా, బ్లూ, గ్రీన్, బ్లాక్, వైట్ గీతలు గల పంచె ధరించి ఉన్నట్లు తెలిపారు. 5.4 అడుగుల ఎత్తు ఉండి తెలుపు వర్ణంలో ఉన్నాడని, కుడివైపు పొట్టభాగాన, కుడి భుజం వెనుకభాగాన పుట్టు మచ్చతో పాటు నల్లటి పులిపిరి ఉన్నట్లు వెల్లడించారు. ఆచూకీ తెలిసినవారు 94419 70940 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ కోదండ రాముడు విజ్ఞప్తి చేశారు.

భవనం పైనుంచి పడి కూలీ దుర్మరణం

కర్నూలు: కర్నూలులోని బిర్లాగడ్డలో నివాసముంటున్న నాగభూషణం (40) నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. నాగభూషణం సెంట్రింగ్ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఎన్‌టీఆర్ బిల్డింగ్స్ ప్రాంతంలో మూడంతస్తుల భవన నిర్మాణం పని జరుగుతుండగా కూలీ పనికి వెళ్లాడు. సామాన్లు తీసుకుని పైకి ఎక్కుతుండగా మొదటి ఫ్లోర్‌లోనే ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఈయనకు భార్య జయమ్మతో పాటు ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం ఉన్నారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

వెల్దుర్తి(కృష్ణగిరి): పాత కక్షలను మనసులో పెట్టుకుని కృష్ణగిరి మండలం పుట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురువ మహేష్‌పై గురువారం రాత్రి వెల్దుర్తి హైవే–44 చెరుకులపాడు టర్నింగ్ గిరి హోటల్ వద్ద దాడి జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కొన్ని నెలలుగా వెల్దుర్తిలో ఉంటున్న మహేష్ రాత్రి టీ తాగడానికి హైవే దగ్గరకు రావడంతో అక్కడే ఉన్న పుట్లూరు గ్రామానికి చెందిన ఉప్పరి కృష్ణ, ఉప్పరి శేఖర్, శ్రీరాములుతోపాటు మరి కొందరు దాడి చేశారు. ఇరు కుటుంబాల మధ్య ప్రేమ వ్యవహారం, పాత కక్షలతో ఈయేడాది జనవరి 30న పుట్లూరు గ్రామంలో కురువ మహేష్‌పై దాడి చేయడంతోపాటు ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ దాడికి సంబంధించి అప్పట్లో కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో 12 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి మహేష్ తన తల్లితో కలిసి గ్రామం వదిలి వెల్దుర్తిలో నివాసం ఉంటున్నాడు. అప్పట్లో దాడి చేసిన వారిలో ఐదారుగురు మళ్లీ ప్రస్తుతం దాడి చేశారు. బాధితుడు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై వెల్దుర్తి ఎస్‌ఐ సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా దాడి జరిగిన మాట వాస్తవమే అని, మహేష్‌ను ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించామన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేస్తామని తెలియజేశారు.



వానలోనూ తప్పని కష్టం

వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలు.. గురువారం పొలం పనులకు వెళ్లారు. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై వర్షం ప్రారంభమైంది. పనిలో నిమగ్నమై వారు వర్షంలో తలదాచుకునేందుకు పడిన కష్టం వర్ణనాతీతం. ఈ దృశ్యం ఎమ్మిగనూరు సమీపంలో కనిపించింది. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు